హరితహారానికి ప్రణాళిక సిద్ధం

- 31గ్రామపంచాయతీలో నర్సరీల నిర్వహణ
- కొనసాగుతున్న బ్యాగు ఫిల్లింగ్ పనులు
- జూన్ నాటికి 1.80లక్షల మొక్కలు అందించడమే లక్ష్యం


సేవాలాల్‌తండా నర్సరీలో మట్టితో నింపిన సంచులు

చివ్వెంల(సూర్యాపేట) : పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ గత ప్రభుత్వం ప్రతియేటా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వచ్చింది. ఇందులో భాగంగా ఇప్పుడు కూడా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏటా నర్సరీలో మొక్కలను పెంచి వర్షాకాలంలో విరివిగా నాటుతూ సంరక్షిస్తున్నారు. ఇప్పటి నుంచే పదో విడత హరితహారం కోసం నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు పెంపకం వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీలో నర్సరీల నిర్వహణ పనులు వేగవంతంగా చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 1.80లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రతినర్సరీలో 10వేల మొక్కలు..

ప్రతి గ్రామపంచాయతీలోని నర్సరీలో 10వేల మొక్కలు పెంచే విధంగా నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. నర్సరీకి ఇప్పటికే మొక్కలను పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగులను సైతం సరఫరా చేశారు. ఈ బ్యాగుల్లో ఒండ్రు, నల్లమట్టి, ఎర్రమట్టి, పశువుల ఎరువును కలిపి ఫిల్లింగ్ పనులు ప్రారంభించారు. నర్సరీల్లో టేకు, ఉసిరి, జామ, సీతాఫలంతో పాటు, వేప, వెదురు, మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఉపాధి పొందుతున్న కూలీలు..

హరితహారం కార్యక్రమం కోసం నర్సరీలో చేపడుతున్న మొక్కల పెంపకంతో ఉపాధిహామీ పథకంలో భాగంగా పలువురు కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఒకొక్క నర్సరీలో బ్యాగు ఫిల్లింగ్ కోసం 15నుంచి 20మంది కూలీలు పనిచేస్తుండడంతో వారికి ప్రతిరోజు రూ.265వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో నర్సరీల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నాం

మండల వ్యాప్తంగా హరితహారంలో మొక్కల పెంపకానికి 31గ్రామపంచాయతీల్లో నర్సరీ నిర్వహిస్తున్నాం. ఈ నర్సరీల్లో ఇప్పటికే మొక్కల పెంపకం పనులు ప్రారంభమయ్యాయి. మొక్కల పెంపకానికి మట్టిని తెప్పించి ప్లాస్టిక్ సంచుల్లో నింపే పనులు చేపడుతున్నాం. జూన్‌లో మొక్కలు అందించేందుకు పనులు వేగవంతం చేయిస్తున్నాం.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల కోసం 12 చుక్కలతో లిపి తయారు చేశారని, మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఈవీఎం మిషన్‌లో బ్రెయిలీలిపి కూడా పెట్టిందన్నారు. కమిటీ సభ్యులు తెలిపిన విధంగా సమస్యలను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి, డీఎంహెచ్ఓ కోటాచలం, వెంకట రమణ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

చివ్వెంల(సూర్యాపేట) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని దురాజ్‌పల్లి శివారులో గల స్వామి నారాయణ్ పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్, ఆనంద్, హర్షిక్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే పనిచేస్తుందని, తాను ఎంపీగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో ఇసుక మాఫియా సాగిందని, కోట్ల రూపాయలు గత పాలకులు కొల్లగొట్టారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ధర్మానికి, అధర్మానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మందుల సామేల్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని, నియోజకవర్గ అభివృద్ధికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పది సంవత్సరాల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కార్యకర్తలందరికీ అండగా ఉంటామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వందశాతం అమలు చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మండల అధ్యక్షుడు వై.నరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పట్టణ శాఖ అధ్యక్షులు పేరాల వీరేష్, తదితరులు ఉన్నారు.

పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్


తుంగతుర్తి : గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గురుకులాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించిన ఉన్నత లక్ష్యాలను చేరే దిశగా తయారు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో తరగతి గది పైకప్పు లేచిపోయిందని, డార్‌మెంట్రి గది సక్రమంగా లేదని, ప్లేగ్రౌండ్ అనుకూలంగా లేదని వాటిని వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురుకులాల సెక్రటరీ రమణకుమార్‌ను ఫోన్ ద్వారా వివరించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు తమకు వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీఈఈ రమేష్, ఎంపీడీఓ భీంసింగ్, ప్రిన్సిపల్ సతీష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, మహిళా అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావు, రేతినేని శ్రీనివాస్, మడ్డి క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపాలిటీలో అభివృద్ధి పేరుతో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 నుంచి 2023ఎన్నికల వరకు స్థానిక మున్సిపాలిటీలో వందల కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నాణ్యత లోపించి అసంబద్ధంగా, అసంపూర్ణంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరి కొంతమంది కాంట్రాక్టర్లు ఇచ్చిన కమీషన్లకు ఆశపడిన అధికారులు, గతపాలకులు నాణ్యత లేకుండా పనులు చేపట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి చొరవ తీసుకొని కలెక్టర్ ద్వారా సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీ వేయించి అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్స్, అధికారులు, గత పాలకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, ఇఫ్టూ జిల్లా నాయకులు వాజిద్, గులాం హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకులు వెర్పుల పర్శురామ్, లక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరి, జీబా, ఉపేందర్, చిరంజీవి పాల్గొన్నారు.

నూతన చట్టాన్ని ఉపసంహరించుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న లారీడ్రైవర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జయహో రథసారథి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యేలేటి వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగితే డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7లక్షల జరిమానా విధిస్తూ తీసుకున్న నిర్ణయం మోటారు రంగ కార్మికులకు గుదిబండగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టంతో మోటారు రంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు రామాంజనేయులు, ధనుంజయ్, లింగస్వామి, అంజి, షకీల్, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం


పారాయణం చేస్తున్న గీతామందిర భక్త బృందం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నకిరేకల్‌లోని గీతా మందిర భక్త బృందంచే విష్ణు సహస్రనామ పారాయణం వైభవంగా నిర్వహించారు. అలాగే సంపూర్ణ భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామార్చన, పుష్పార్చన కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో తరలివచ్చి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు అయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతల పంపిణీ


నాగారంలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

నాగారం : అయోధ్యలో రామాలయ అక్షింతలను మండలంలోని ఫణిగిరిలో సోమవారం భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు హరినాథచార్యులు, భక్తులు సంజీవ, వంగూరి అంజియాదవ్, కీర్తి సోమయ్య, మంగదుడ్ల దశరథ, లింగమల్లు, లింగరాజు, చిప్పలపల్లి మల్లయ్య, కేశవులు, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నూతనకల్ : అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అక్షింతల శోభాయాత్ర

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో అయోధ్య అక్షింతల కళశాల శోభాయాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం సత్యనారాయణగౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

నూతనకల్ : పార్లమెంట్ ఎన్నికల్లోపు కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బ్రహ్మాండ్లపల్లి భవానీశంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 29, 30తేదీల్లో ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీలను గుర్తించి వారికి రాజకీయ పదవులను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నరేష్, అశోక్, మధు, రవీందర్, సురేష్ ఉన్నారు.

స్టోన్ క్రషర్ ప్లాంట్‌ను మూసివేయాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రైతులకు నష్టం కలిగించే విధంగా ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ ప్లాంట్‌ను వెంటనే మూసివేయాలని అఖిలపక్ష నాయకులు, బాధిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధిత రైతులు, అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. ఆత్మకూరు (ఎస్) గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన కేఎస్ఎస్ఆర్ స్టోన్ క్రషర్‌తో చుట్టు పక్కల గ్రామాల్లో పర్యావరణ కాలుష్యంతో ఇబ్బందుపడుతున్నామని, బ్లాస్టింగ్‌తో ఇళ్లు బీటలువారుతున్నాయన్నారు. పెద్దగుట్టపైన క్రషర్ మిల్లు బ్లాస్టింగ్‌తో రాళ్లు పంట పొలాల్లో పడుతున్నాయని, దీంతో పంటకు తీరని నష్టం కలుగుతుందన్నారు. బ్లాస్టింగ్‌లతో రైతులు పంట పొలాల వైపు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి క్రషర్ మిల్లును శాశ్వతంగా మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు(ఎస్) గ్రామ సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, అఖిలపక్ష నాయకులు కాకి కృపాకర్ రెడ్డి, తంగెళ్ల పెద్ద వీరారెడ్డి, గుణగంటి శ్రీను, చందా కృష్ణమూర్తి, పందిరి రాంగోపాల్‌రెడ్డి, రైతులు పందిరి మాధవరెడ్డి, గిలకత్తుల ఎల్లయ్య, వినవరం రాంరెడ్డి, పందిరి కృష్ణారెడ్డి, పోరేండ్ల రాజయ్య తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్

అర్వపల్లి : విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈఓ బి.బాలునాయక్ సూచించారు. సోమవారం జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాల ప్రాథమికోన్నత పాఠశాలల జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ పాఠశాలల్లో చేపడుతున్న బోధన నైపుణ్యాలను ఒకరికొకరు పాలుపంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి లక్ష్య కార్యక్రమాల అమలు సరైన విధంగా జరగాలన్నారు. సమావేశంలో రిసోర్స్‌పర్సన్ నోముల వెంకటేశ్వర్లు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు హేమమాలిని, కరుణాకర్, రామచంద్రయ్య, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తకాలు, ఫర్నీచర్ ధ్వంసం

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి అందులోని పుస్తకాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గ్రంథాలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రంథాలయం ఆవరణలో గుర్తు తెలియని ఆకతాయిలు రాత్రిపూట మద్యం సేవించి గ్రంథాలయంలోకి వెళ్లి అందులోని పుస్తకాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినట్లు లైబ్రేరియన్ శ్రీనివాస్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగోత్సవ వేడుకల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలతో విద్యార్థులు, పాల్గొన్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నాగారం : మండలంలోని ఫణిగిరి మేరీమథర్ పాఠశాలలో ఇండియన్ ఆర్ట్ ముంబై సంస్థ వారి ఆధ్వర్యంలో గత నెల 30న నిర్వహించిన రంగోత్సవ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌మేరి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇండియన్ ఆర్ట్ ముంబై సంస్థ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన రంగోత్సవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, చేతిరాత, కథారచన, చిత్రాలకు రంగులు అద్దుట తదితర పోటీలను నిర్వహించనట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 55మంది విద్యార్థులు బంగారు పతకాలు, 8మంది విద్యార్థులు క్యాంస పతకాలు, అమృత్ మెరిట్ అవార్డులు సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారిలో ప్రణిత, రిత్విక, అమృత్ మెరిట్‌అవార్డులు సాధించిన వారిలో రిషిత, శివాని ఉన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల మేనేజర్ సిస్టర్ రీనా జేవియర్, ఉపాధ్యాయులు జటంగి సతీష్, వెంకట్, టింటు, శైలజ తదితరులు అభినందించారు.

కవయిత్రి అర్చనాదేవికి గోల్డ్‌మెడల్

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు చెందిన యువ కవయిత్రి శ్రీపాద అర్చనాదేవి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల ఆదికవి నన్నయ్య కళాశాల ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలలో కవి సమ్మేళనంలో పాల్గొని ప్రశంసా పత్రం, గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చైతన్య రాజు సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలో మూడు రోజులపాటు రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించారని తెలిపారు. ఇక్కడ కవి సమ్మేళనంలో పాల్గొని బంధం బాధ్యత కథ, అర చేతి వైకుంఠం కవితా పఠనం చేసినట్లు తెలిపారు. దీంతో నిర్వాహకులు ఆంధ్ర సారస్వత పరిషత్ జాతీయ సమన్వయకర్త డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, రాజేష్ డాక్టర్ కేటి పద్మ ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్‌తో సత్కరించినట్లు ఆమె తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని మిద్దనపల్లి గ్రామానికి చెందిన కొర్వి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో పాటు చదువుకున్న పదోతరగతి పూర్వ విద్యార్థులు సోమవారం శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబానికి రూ.36వేల ఆర్థికసాయం అందించారు.

వెలుగుపల్లిలో ఉచిత వైద్యశిబిరం


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

తుంగతుర్తి : మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో కాంత్రి, అంబేద్కర్, నేతాజీ, యువసారథి యువజన సంఘాలు తెలంగాణ ఫుడ్‌కార్పొరేషన్ మాజీ చైర్మన్ సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మామిడి వెంకన్న వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వైద్యులు ప్రజలకు వివిధ రకాలు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఉపసర్పంచ్ పరమేష్, జాగృతినాయకులు గఫార్ ఖాన్, మహేందర్, చరణ్, పరుశరాం, మణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే

అర్వపల్లి : మండలంలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపునకు అర్వపల్లి భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు ఇందు, వినీతలు సర్వే నిర్వహించారు. ఈనెల 10వరకు ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే జరుగుతుందని, దివ్యాంగులు, మానసిక వైకల్యం కలిగిన పిల్లలను గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. మానసిక, శారీరక వైకల్యం కలిగిన పిల్లలకు భవిత కేంద్రాల ఆధ్వర్యంలో వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వేలో గుర్తించిన వారికి వసతులు సైతం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

10వరకు పెండింగ్ చలాన్ల చెల్లింపునకు గడువు

అర్వపల్లి : వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను రాయితీపై చెల్లించడానికి ఈనెల 10వరకు గడువు ఉందని అర్వపల్లి ఎస్ఐ బి.అంజిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈ చలాన్లపై ప్రభుత్వం రాయితీ ఇస్తున్నందున వాహనాలపై గతంలో ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని సూచించారు.

భువనగిరి ఎంపీ టికెట్ చెవిటి వెంకన్నకు కేటాయించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ ఎంపీ టికెట్ చెవిటి వెంకన్నయాదవ్‌కు కేటాయించాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మడ్డి క్రిష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని దశాబ్దాల కాలంగా పనిచేస్తూ, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్న చెవిటి వెంకన్నయాదవ్ ఎంపీ టికెట్ కేటాయించాలని కోరారు. ఆయన వెంట ఉప్పలయ్య, శివ, సత్యనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీనివాసుడు ప్రత్యేక సింహాసనాన్ని అధిరోహించాడు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు గోదాదేవి కోరిక మేరకు శ్రీనివాసుడు తన సింహాసనాన్ని అధిరోహించి భక్తుల కోరికలు నెరవేర్చిన తతంగాన్ని భక్తులకు వివరించారు. ఈనాటి పాశురంలో స్వామి నడక సౌందర్యాన్ని వివరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి మహిళా భక్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భానుపురి (సూర్యాపేట) : సినీ నటుడు జూనియర్ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) అభిమాన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగార్జున సోమవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిని హీరో అంటే కేవలం నటనకే పరిమితం కాకుండా పేదలకు సేవ చేయడం జూనియర్ ఎన్టీఆర్‌కు మాత్రమే సాధ్యమైందని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీపాది జానకిరాములు, చింతలపాటి వెంకటేష్, శంకర్, జక్కుల నాగరాజు, నయీమ్, సుధాకర్, మామిడి ఉపేందర్, రమేష్, సందీప్, గణేష్, జల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

చివ్వెంల(సూర్యాపేట) : దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. సోమవారం మండలంలోని గుంపుల గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30లోగా స్పష్టత ఇవ్వకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, నాయకులు మధు, భిక్షం, లింగయ్య, మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

అర్వపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీని ఆడిట్ బృందాలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. సోమవారం మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో జరిగిన 14వ రౌండ్ సామాజిక తనిఖీ గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, టీఏ నాగమణి, పంచాయతీ కార్యదర్శి డి.నవీన్‌రెడ్డి, డీఆర్‌పీ బి.శైలజ, ఫీల్డ్‌అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు, సోషల్ ఆడిట్ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం


దగ్ధమైన పూరి గుడిసె

పెన్‌పహాడ్ : షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మండవ శైలజకు చెందిన పూరిగుడిసెకు సరఫరా అయ్యే విద్యుత్ తీగలు తెగి గుడిసెలో ఒకదానికి ఒకటి ఆనుకొని మంటలు లేవడంతో గుడిసె దగ్ధమైంది. స్థానికులు గమనించి వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో సంఘటన స్థలాన్ని ఆర్ఐ స్వప్న పరిశీలించి పంచామా చేసి రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

ఆ చేరికలు చెల్లవు..

మద్దిరాల : అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురి చేరికలు చెల్లవని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షుడికి గానీ, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు గానీ తెలియకుండా ఎలాంటి చేరికలు జరగకూడదని ఆయన సూచించారు. జిల్లా అధ్యక్షుడి, ఎమ్మెల్యే అనుమతి తప్పనిసరిగా ఉండాలని అన్నారు.